మా ఆవిడ సరదాలు

'అరుంధతి'

అవురు అవురు మంటూ ఆరుగంట లయ్యేసరికి సంచినిండా ఫైల్సు పెట్టుకుని కాళ్ళీడ్చుకుంటూ యింటి గుమ్మంలో అడుగు పెట్టగానే యింకేముంది-లాకౌట్. అమ్మగారు యెక్కడికో పెత్తనాలకు దయచేసినట్లున్నారు. హరి భగవంతుడా అనుకుంటూ చేతిలోని సంచి గుమ్మానికి జేరవేసి కూర్చున్నాను. కడుపు దహించిపోతోంది. ఎప్పుడో తొమ్మిది గంటలకు తిన్న మెతుకులు - ఒంటిగంటన్నరకు కాసిని కాఫీ నీళ్లు మ్రింగాను. వెధవ కాఫీ అది కూడా ఆనుదం వాసనే. ఎదిరింటి సుదర్శనం అప్పుడే ఆఫీసునుండి రావటం అన్నీ అయ్యాయి. పేపరు పుచ్చుకుని హాయిగా ఈజీ చైరులో కూలబడ్డాడు. "ఏమండోయ్, మూర్తిగారూ! ఏమిటి మీరు రోజూ కట్టలు కట్టలు పట్టుకొస్తున్నట్లున్నారే!" అన్నాడు. నవ్వుతూ. నాకు ఒళ్లు మండిపోయింది. "మీకేమండి, మహా రాజులు కేంద్రప్రభుత్వంవారు. మీకీలాంటి బాధలు లేవులెండి" అంటూ నేవున్నాను - వాళ్ళింట్లోంచి మా ఆవిడ చిరునవ్వు నవ్వుకుంటూ వచ్చి తలుపు తీస్తూ "ఏమండి సుదర్శనంగారు ఐదు కొట్టిన పది నిమిషాలకంతా వచ్చేస్తారు. మీ కొక్కరికేనా యేమిటి యీ ఆలస్యం?" అంది. సాగదీసుకుంటూ.

దానికి సమాధానం చెప్పడానికి కూడా ఓపిక లేదు; వెనకాలే లోపలికి వెళ్ళి ముఖం కడుక్కుంటున్నాను. "ఆయన చూడండి, రోజూ వచ్చేటప్పుడు మల్లె పెంగలు పట్టుకొస్తారు" అంది. సమాధానం చెప్పకుండానే మంచంమీద కూలబడ్డాను.

"ఏమండి! రేడియో సంగతి యేంచేశారు?"

"ప్రాణాలు పోతుంటే రేడియో యేమిటే?" అన్నాను విసుగ్గా.

"అది సరే ప్రాణాలు పోకుండా కాస్త పోస్తాను కాని రేడియో మాట యేమిటి చెప్పండి."

"చెప్తాను ముందర టీ తీసుకురా..."

"ఆఁ! యేమిటి తీసుకొచ్చేది నాలుగు నెలల బట్టి అంటున్నారు. ఇదిగో వస్తోంది, అదిగో వస్తోంది అని" విసుక్కుంటూ ఫ్లాస్కులోని టీగ్లాసులో పోసింది. మాట్లాడకుండా త్రాగేసి, "ఏమే! ఇది కాఫీయా, టీయా, ఓవల్టీనా - యేమిటిది? మా దిల్ కుష్‌ను మించిపోయింది" అన్నాను.

"ఏంచెయ్యమంటారు! టీపొడుం అయిపోయింది. కొందామంటే చేతిలో కానీలేదు. వెధవది - మొదటి తేదీ యింకా పది రోజులుంది - ఏమండి! యీ నెల యెన్నిరోజులు" అంటూ కేలండరు చూచి, "ముప్ఫై ఒకటే - చచ్చాం! ఇంకా పదకొండు రోజులు గడవాలి... ఏమండి ఒకటో తేదీ ఆదివారం. ఎల్లాగండి బియ్యం యింకో వారం రోజుల కొస్తాయేమో... అదీ సరేగాని... రేడియో మాట యేంచేశారండి?"

"ఏమిటి చేసేది! మనమెంత మన తాహతెంత? రేడియో - కావాలిట - రేడియో! నీకు రేడియో కావలిస్తే చేతికున్న గాజులు, మెడలో చంద్రహారం యిలా యివ్వు- రేడియో పట్టుకొస్తాను. అయినా మనకి రేడియో యెందుకు చెప్పు? ఈ ప్రక్కవారికుంది ఆ ప్రక్కవారికుంది. ఎదురింటి వారికుంది..."

"అది కాదండీ! వాళ్ళ రేడియోపాటలు నేను వినను. మంది మనకుండాలి.. పోనీలెండి, ముద్దుముచ్చట యేమీలేదు. అందరూ చూడండి..."

"అవునవును అందరు ఆడవాళ్ళు యిలా వుంటున్నారా? అయ్యో! ఐదు గంటలకు అవురుమంటూ

యింటికొస్తాడు-పోనీ కాసిని-మంచినీళ్లైనా యిద్దాం వచ్చేసరికి - అనే బుద్ధి యేమైనా వుందా! ఈ జంతువు కాళ్ళీడ్చుకుని ఉసూరుమంటూ యింటికి వచ్చేసరికి వీపు పెత్తనాలు...ఏం?"

"అది సరేగాని - రేడియోమాట చెప్పండి..."

"ఏమిటి చెప్పేది-టీ పొడుం కొనడానికి అర్థణా లేదని నువ్వే అంటున్నావు-రేడియోకి రెండువందల యాభై యెక్కడినుండి వస్తుందనుకున్నావు."

"అది కాదండి. వాడెవడో వాయిదాలమీద యిస్తాడన్నాడుగా"

"ఇస్తే - మొదట వందరూపాయలు కట్టొద్దూ."
"కట్టండి..."

"మా తాత పాతర వెయ్యలేదు...పోనీ మీ నాన్న కొని యివ్వకూడదూ."

"మనకి మా నాన్న యెందుకివ్వాలి? మనమే కొనుక్కుందాం. రేపు జీతం రాగానే డబ్బు కట్టేసి రేడియో పట్టుకురండి."

"రేడియో పట్టుకొస్తాను. మనం తిండి మానేసి సంగీతం వింటూ కూర్చుందాం."

"అదంతా మీ కనవసరం. ఎల్లాగో నే సర్దుకుంటాను." అనేసరికి దాని దగ్గర యే మాత్రమో వుందనుకుని నిశ్చయించుకున్నాను.

రెండవ తేదీ రానేవచ్చింది. ఏడు గంటలకంతా యిల్లు చేరాను. తలుపుతట్టి 'ఏమే' అనేసరికి పరుగెత్తు కుంటూ వచ్చి "రేడియో పట్టుకొచ్చారా?" అంటూ తలుపు తీసింది. ఎదురుగా నేను, నా ఫైలున్న సంచి సిద్ధం. "ఏమండి రేడియో యేది? ఈ వేళ మీరు పట్టుకొస్తున్నారని చుట్టుప్రక్కల అందరికీ చెప్పాను. ఇదేమిటండి యిట్లా చేశారు. రేపు ప్రొద్దుటే అందరూ అడుగుతే యేమిటి చెప్పేది?" గుక్క తిప్పుకోకుండా అనేసి వెనకాల రిక్షావాడు పట్టుకొస్తున్న రేడియోచూచి, "పట్టుకొచ్చారూ! చెప్పరేంమరి! ఈవాళ మా నాన్నకి కూడా ఉత్తరం రాశాను రేడియో కొనుక్కున్నామని" అంది.

నేనేమీ మాట్లాడకుండా రిక్షావాడికి డబ్బులిచ్చేసి లోపలికి వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కుని వచ్చి కుర్చీలో కూలబడ్డాను.

"ఏమండి టీ త్రాగుతారా?" అంది గ్లాసుక్కు పట్టుకొచ్చి.

"టీ పొడి యెక్కడిది?"

"ఎదిరివారింట్లో అప్పు పట్టుకొచ్చాను."

"ఏడిసినట్లుగానేవుంది. ఒకప్రక్క మూడువందలు పెట్టి రేడియో కొనకమానూ, మరో వైపు అర్థణా టీపొడి అప్పుచెయ్యడమూను."

"సరేగాని ముందు రేడియో పెట్టండి అందరూ పెట్టుకుంటున్నారు."

చచ్చినట్లు అంతాచేసి రేడియో పెట్టాను. టీ త్రాగుతారా అందే కాని గ్లాసుక్కులోంచి తియ్యనే లేదు. అప్పుడే ఎనిమిదన్నర అయింది. ఆకలి దహించేస్తోంది.

"ఏమే, అన్నం పెడతావా?"

"అబ్బ ఉండండి - కాస్సేపు మంచి పాటలు వస్తున్నాయి తొమ్మిది గంటలకు తిందాం."

"ఆకలేస్తోందే"
"ఇప్పుడే కదుటండీ టీ త్రాగారు"
"ఇచ్చావా?"
'త్రాగలేదూ-అయ్యో, అందులోవుంది త్రాగండి"
"ఒసేయ్-కాసిని - టీ నీళ్లు త్రాగుతే యెంతే ప్రొద్దున్న తొమ్మిది గంటలకు తిన్న మెతుకులు."
"చంపేస్తున్నారండి. నడవండి-వస్తున్నా."

♦ ♦ ♦

పదిహేను రోజులు గడిచాయి. ఒకవాడు ఎం పోయిన మాగాయి, లైపిండిలా తయారైన అన్న

ముద్దకంచంలో పడేసి చూస్తూ యెదురుగా కూర్చుంది. నాకు ఒళ్లు మండిపోయింది. "ఏమిటే యిది నీ ముఖం యేమిటీ అన్నం?"

"ఏమీలేదండి. కుంపటిమీద బియ్యం పడేసి మంచిపాట వస్తుంటే రేడియోదగ్గర కూర్చున్నాను. కాస్త మెత్తపడింది అంతే...కలపండి. అల్లా చూస్తా రెందుకు? కూరా నారా యేమీలేదు."

మాతోస్మి అనుకుంటూ భోజనం కానిచ్చి నా ఫైల్సు సంచి ముందర వేసుకొని, "ఒసేయ్ కాస్త రేడియో తగ్గించవే. కాస్సేపు వ్రాసుకోవాలి" అన్నాను.

"ఉండండి. వెధవ వ్రాత ఎప్పుడూ వుండనేవుంది. ఈనాడు క్రొత్తది కనకనా!"

"అదికాదే ఈ కాగితాలు వ్రాసి పట్టుకెళ్ళక పోతే రేపు పీకలమీదకు వస్తుంది."

"ఏమిటండి మీదంతాను! ఎవడా ఆఫీసరు-ఎవడండి రాత్రిళ్లుకూడ మిమ్మల్ని ఆఫీసు పని చెయ్యమన్నది? ఎంత గవర్నమెంటు ఉద్యోగం అయితే మాత్రం - యింటిదగ్గర పెళ్ళాంతో కూడ మాట్లాడకుండా ఆఫీసు కాగితాలు వ్రాయమంటాడేమిటి? ఎదిరింటాయన చూడండి..."

"పూర్తయిందా యింకా యేమన్నా వుందా?"

"అది సరేగాని - యేమండి యెల్లుండి నా పుట్టిన రోజు..."

"అయితే?"

"ఔరంగాబాదు సిల్కు చీరండి."

"మీ నాన్నను ఐదువందలు పంపించమను - నీకు కావలసిందల్లా కొంటూవుంటాను."

"అదిగో ఆమాటే అనవద్దన్నాను ఏం - మా నాన్న యెందుకివ్వాలి?"

"నీకు యివన్నీ కావాలి కనక... అవున్లే. ఒకనాడు యిచ్చాడు కనకనా యీనాడు యివ్వడానికి! ఇంత వరకు అరకాసు ఉంగరం పెట్టడానికి లేకపోయింది"

"మహా మీవాళ్లు పెట్టేసినట్లు! గుమ్మంలోకి వెడితే ముఖాన్న బొట్టుకూడ పెట్టలేకపోయారు."

"అదిసరే - తీర్చవలసిన అప్పులు యేమాత్రం వున్నాయి చెప్పు. మధ్యాహ్నం పోలీసువాళ్ళొచ్చారు."

"పోలీసు వాళ్ళా?"

"అవును పాత బాకీలు యెన్ని చెప్పు."

"ఇంటి అద్దె రెండు నెల్లది..."

"అదేమిటే!"

"ఏమిటి? క్రిందటి నెలలో మా తమ్ముడు వచ్చినప్పుడు మరి గుడ్డలు పెట్టలేదూ! ఎక్కడినుండి వచ్చాయనుకున్నారు? ఈ నెలలో నా చేతికి ఏభై రూపాయలిచ్చారు తెల్సునా?"

"ఇంకా..."

"పాలవాడికి రెండు నెల్లది. బట్టల కొట్టువాడికి పదహారు..."

"ఇంకా బట్టల కొట్టేమిటే..."

"అవును. మరి మొన్న చీర తీసుకోలేదూ! చెప్పడం మరచిపోయాను. ఆ కొట్టువాడు సుదర్శనం గార్కి తెల్సునట. ఆవిడ నేను వెళ్ళి తెచ్చుకున్నాం"

"ఇదేమైనా పట్నవాసమనుకున్నావా - మీ తాతగారి పల్లెటూరనుకున్నావా? అప్పులు పెట్టడానికి! రేపు పోలీసువాళ్ళొచ్చి తీసుకుపోతూంటే చూస్తూ కూర్చుందువుగాని-ఊరంతా అల్లరి అవుతుంది."

"జైలా?"

"అవును. ఎల్లుండి సాయంకాలంలోగా అప్పులు తీర్చకపోతే జైలు ఖాయం."

"మా నాన్నగార్కి ఉత్తరం వ్రాయండి" అంది బిక్కముఖంతో.

"నా కనవసరం. నేను వ్రాయను అప్పులు చేసి పీకమీదకు తెచ్చింది నువ్వూను ఈ ఉత్తరం వ్రాసేది నేనా? ఒకటా - రెండా - ఐదు వందలు - జీవితంలో తీర్చగలమా?"

"మా నాన్నగారికి టెలిగ్రాం యివ్వండి ఆయన వస్తారు."

"అంటే - మీ నాన్న కళ్లెదురుగా నన్ను జైలుకు వెళ్ళమన్నావన్నమాట."

"పోనీ డబ్బు పంపమని వెంటనే జాబు వ్రాయండి."

"ఆ రాసేదేదో నువ్వే వ్రాయి."

"ఏమని వ్రాయమంటారు?"

"ఏముంది - ఊరంతా అప్పులు చేశాను. అవి తీర్చనందున పోలీసువాళ్ళొచ్చి మా ఆయన్ని జైలుకు తీసుకెళ్తారు..."

"అదేమిటండి."

"అవును వ్రాయి. ఐదు వందలు అప్పు తీర్చవలసి వచ్చింది. ఎల్లుండి సాయంకాలంలోగా తీర్చకపోతే అరెస్టుచేసి జైలుకు తీసుకుపోతారట. అందువలన వెంటనే 500 లు పట్టుకుని రావలెను. తీసుకు రాకపోతే చాల అభాసు జరుగుతుంది."

"ఏమండి వాళ్లందరూ యేమైనా అనుకుంటారేమో?"

"ఇక్కడ చస్తూవుంటే అనుకోవటమేమిటే! అనుకుంటే అనుకోనీ."

♦ ♦ ♦

ఆ మూడోనాటి రాత్రికల్లా అష్టకష్టాలుపడి ఐదు వందలు తీసుకుని నురుగులు కక్కుకుంటూ మామగారు వచ్చారు.

"ఏమిటోయ్ యిదంతాను?"

ఆయన్ను చూడగానే నాకు నవ్వు, జాలి కూడ కలిగాయి: "ఏముంది - మీ అమ్మాయి చేసిన ఘన కార్యం."

"ఏమిటే అమ్మాయి! ఏమిటిది?"

"ఏమీలేదు నాన్నగారూ! అప్పులు పెరిగిపోయాయి. అందరూ పీకలమీద కూర్చున్నారు."

"ఏమోయ్! అంత తెలియకుండా అప్పులు యెలా చేశారు?"

"నాకేమీ తెలియదు మీ అమ్మాయి నడగండి. తెచ్చినదంతా దానికీ దీనికీ ఖర్చుపెట్టేసి అందరి దగ్గరా అప్పులు పెంచేసింది. రేడియోకి మూడువందలు - యింకా డబ్బు యివ్వనేలేదు - అప్పుడే రిపేరు కొచ్చింది. ఇంటి అద్దె, పాలు, పెరుగు, నూనె, బట్టలకొట్టు - ఒకటేమిటి - సమస్తమూ అప్పులు పెట్టేసింది."

"ఇలా అప్పులుచేస్తే యెల్లాగ, ఏదో వచ్చిన దాంతో సర్దుకోవాలిగాని."

"ఆ మాట దానికి చెప్పండి - యికమీదనైనా కుదురుగా వుంటుంది."

"బాగుందర్రా - బాగుంది. మీరు అప్పులు చేస్తున్నప్పుడల్లా తీరుస్తూవుండడానికి పాతరేమైనా వేశాననుకున్నారా? ఒసేయి అమ్మాయి! నువ్వొక్కత్తివేకాదు నాకు ఆడపిల్ల, ఇంకా యిద్దరున్నారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు చెయ్యాలి. ఇకపైన అప్పులుచేసి పీకమీదకు తెచ్చుకుంటే యెవరి ఖర్మ వారనుభవించవలసిందే. ఇదిగో ఐదువందలు నేను వెళుతున్నాను." అంటూ లేచాడు.

"ఇప్పుడెక్కడికి వెడతారు అర్ధరాత్రి? రేపు వెళ్ళవచ్చు."

"అబ్బే, నాకు తలమునిగినన్ని వ్యవహారాలు. ఈ ఉత్తరం చూచుకుని కరణంగారి దగ్గర అప్పుతీసుకుని యింటిదగ్గరైనా సరిగ్గా చెప్పకుండా బయల్దేరి వచ్చాను. పదకొండు గంటల బండికి వెళ్ళిపోవాలి"

అంటూ మంచం మీదనున్న కండువా తీసి భుజం మీద వేసుకుని బైటికి వచ్చేశాడు.

"భోజనం చేసైనా వెళ్ళండి" అన్నాను.

"అబ్బే. లేదు" అంటూ "నేను వెడుతున్నాను- అమ్మాయి! జాగ్రత్తగా సంసారం చెయ్యడం నేర్చుకో" అని ఆ చీకట్లో వెళ్ళిపోయాడు.

"ఏమే రేపు క్రొత్త రేడియో" అన్నాను.

"అదేమిటి - యిదో..."

"అది మనది కాదు. రాజుది ఎరువుపట్టుకొచ్చాను"

"అయితే అబద్ధాలు చెప్పి ఉత్తరం యెందుకు వ్రాయించారు?"

"నీకు రేడియో అక్కర్లేకపోతే రేపు ప్రొద్దునే డబ్బు పంపించేస్తాను"

"ఆయన యెంత బాధ పడుతాడో..."

"అంతేనేకాని మొగుడు చస్తున్నాడన్నది నీకు లేదు" "సరే భోజనానికి రండి."



క్రొత్త రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు నోపిన్ త్వరలో అమలులోనికి రానున్నది